
# ఇల్లు కట్టి చూడు!

"మల్లాది లక్ష్మి"



**ముచ్చటయిన** చిన్న ఇల్లు. చుట్టూ చిన్న తోట. ఆ తోటలో ఆడుకునేందుకు ఇద్దరు పిల్లలు. ఆ పిల్లల్ని చూస్తూ తనతో ప్రేమగా. ముచ్చట్లాడే మంచి భర్త-ఇది జానకి టీనేజ్ డ్రీం!

ఆ తీపి కలను నిజం చేయటానికి జానకి శోభనం రోజు నుంచే పూనుకుంది.

సొంత ఇళ్ళల్లో గల లాభాల్ని వివరించింది.

అద్దె కొంపల్లో ఉండే నష్టాల్ని ఎత్తి చూపింది.

రామూ ్మర్తి కూడా భార్య అభిప్రాయాలతో ఏకీభ వించాడు. ఇల్లు కొనటానికి ఒప్పుకున్నాడు.

ఇద్దరూ కల ిసి ఇంటివేట మొదలెట్టారు.

తమ బడ్జెట్‌లో సెపరేట్ హౌ ్స రాదు. ఫ్లాట్‌లే దొరుకుతాయి అని బ్రోకర్లు చెప్పినప్పుడు తెగ దిగులు పడింది జానకి. ఉత్సాహం సహం చచ్చిపోయింది.

"పోనీ. ఊరికి దూరంగా బంగళా కొందామా?"

అడిగాడు రామ్మూర్తి.

"ఒద్దు. మీకు ఆఫీసుకు పోనూ, రానే ఎక్కువ టైం గడిచిపోతుంది. ఇద్దరం కలసి ఎక్కువ సేపు గడపలేని ఇల్లెందుకు?"

"పోనీ, ఊరి మధ్యలో ఖాళీ స్థలం కొని, చుట్టూ చక్కటి తోట వేసుకొని, మధ్యలో చిన్న పర్ణశాల నిర్మించి వనవాసం చేద్దామా?" భార్యను ఉడికించాడు.

"మీకు ఎగతాళిగ ఉంది. నాకెంత దిగులుగా ఉందో చెప్పలేను. ఫ్లాట్ సిస్టం నాకిష్టమే లేదు. ఓ గార్డెనూ, కాంపౌండు ఏవీ ఉండవు. అసలు ఇళ్ళున్న ఫీలింగ్ రాదు. ఏదో హాస్టల్ రూములలో ఉన్నట్లు ఉంటుంది." దిగులుగా అంది.

అయినా, గత్యంతరం లేక ఫ్లాట్ కొనడానికి ఒప్పుకుంది.

మద్రాసులో ఫ్లాట్ దొరకటం అంటె మాటలా?

ఆర్నెల్లు పట్టింది వీరికి నచ్చిన ఫ్లాట్ దొరికేసరికి. అది కూడా జానకికి నచ్చింది అనటం కంటె, నచ్చజెప్పుకుంది అనటం సబబు.

రిజిస్ట్రేషన్ గట్రాలన్నీ అయిపోయాయి.

సింపుల్‌గా గృహప్రవేశం అయిందనిపించారు.

ప్రక్కిళ్ళ వారితో పరిచయం చేసుకుంది జానకి.

** ** **

జానకి ఫ్లాట్ నంబర్ ఏడు. మొదటి అంతస్తులో ఉంది. ఆ బిల్డింగ్‌లో గ్రౌండ్ ఫ్లోర్‌లో కాక మూడంతస్థులున్నాయి. ఒక్కో అంతస్థుకీ నాలుగేసి ఇళ్ళున్నాయి. నాలుగు ద్వారాల మధ్యా స్థలం చాలా తక్కువ. పైగా మెట్ల దారి కూడా అదే.

జానకికి ఇంకా మంచి అరవం రాదు. కనుక 5 వ నంబర్‌లో ఉండే అరవావిడ వసంత మామితో జానకి స్నేహం పెద్ద ముందుకు పోలేదు. పరిచయాలు, చిరునవ్వులతోనే ఆగిపోయింది.

8 వ నంబరులో ఉండే వర్ధనమ్మ తెలుగావిడ అయినా, మనిషి పెద్ద కలుపుగోలుకాదు కనుక అక్కడా జానకికి చుక్కెదురయింది.

ఇహ మిగిలింది 6 వ నంబర్ ఫ్లాట్. అందులో తల్లి, కొడుకు, కోడలూ ఉంటారు. ఆ ముసలావిడను అందరూ 'పాటీ' అంటారు.

కొడుకు కోడళ్ళిద్దరూ ఉద్యోగస్థులు కనుక ఆ పాటీ ఎప్పుడూ జానకి ఇంట్లోనే కూర్చునేది.

అది జానకికి చాలా విసుగ్గా ఉంది.

కసురుకున్నాడు రామ్మూర్తి. "వర్ధనమ్మ మాట్లాడలేదని ఉడుక్కున్నావు. ఈవిడ ఎక్కువ మాట్లాడుతుందని విసుక్కుంటే ఎలా?"

"అది కాదండి అసలు సంగతి. ఆవిడ అరవం తెలుగు వినలేక చచ్చిపోతున్నాను. ఇంట్లోకి రాగానే 'వాడు ఆఫీసుకు వెళ్ళాడా?' అని అడుగుతుంది మీ గురించి. అది వింటేనే నాకు చికాకు." ముఖం చిట్లిస్తూ అంది.

"పోనీలే పెద్దావిడ. వాడు అంటే తప్పేం లేదు." సర్ది చెప్పాడు.

"అంతేకాదు; ఎంత సేపూ ఆ కోడలిమీద చెప్తూ ఉంటుంది. పైగా ఓ టైం అంటూ లేదు. పొద్దున స్నానం చేస్తూ ఉంటే బెల్ కొట్టింది. ఎవరో అనుకుని అదరా బదరా వచ్చాను. మధ్యాహ్నం మంచి నిద్రలో ఉండగా వస్తుంది."

"అదీ ఒకందుకు మంచిదేలే. నీకు తోడుగా ఉంటుంది."

"ఏంతోడో ఏం పాడో? ఈవిడ ఇలా రాబట్టి ఆ కోడలికి నేను బద్ధ శత్రువు అయిపోయాను. నన్ను చూస్తూనే ముఖం తిప్పుకుని పోతుంది. ఏవిటో అవస్థగా ఉంది అన్నివిధాలా."

"ఊర్కెనే గోరంతను కొండంతలు చేయకు." కొట్టి పారేశాడు.

** ** **

"ఇవాళ వెనకాల బిల్డింగ్‌కు వెళ్ళాను. ఫస్ట్ ఫ్లోర్‌లో సరిగ్గా మన కిచెన్ వెనకాల ఉన్న ఫ్లాట్‌లో తెలుగు వాళ్ళున్నారు." భర్తకు కాఫీ ఇస్తూ ఉత్సాహంగా చెప్పింది జానకి.

"మంచిది." ముక్తసరిగా అన్నాడు.

"బాగా మాట్లాడింది. పేరు సరోజట. భర్త ఏదో కంపెనీలో సేల్స్ రెప్రజెంటేటివ్‌గా పని చేస్తున్నాట్ట. ఒక కూతురు... పాప పేరు సంగీత." వివరాలు ఇచ్చింది.

రామ్మూర్తేం మాట్లాడలేదు.

మళ్ళీ తనే అంది- "అసలు వాళ్ళింటి క్కూడా వెళ్ళనక్కరలేదు. ఆవిడ వాళ్ళ బాల్కనీ లోంచి, నేను కిచెన్ లోంచి మాట్లాడుకోవచ్చు. ఇన్నాళ్ళకి కాస్త నాకు నచ్చిన కంపెనీ దొరికింది." కొత్త వాతావరణంలో కొత్త స్నేహితుల మధ్య కొత్త కబుర్లతో జానకికి రోజులు క్షణాల్లా దొర్లిపోతున్నాయి.


మంట • దురద • రక్తం కారడం
మూల వ్యాధికి మొదటి లక్షణాలు.

వెంటనే చికిత్సను మొదలెట్టండి.
ఆపరేషన్ చేసే పరిస్థితిని రానియ్యకండి.

మూలవ్యాధి సాధారణంగా వచ్చే వ్యాధి. కాని అశ్రద్ధ చెయ్యడం వల్ల అది ముదిరిపోవచ్చు. అప్పుడిక ఆపరేషన్ చెయ్యవలసి రావచ్చు.

మూలవ్యాధికి ప్రభావంతో పనిచేసే చికిత్స, ప్రెపరేషన్-హెచ్*. దీన్ని విదేశాల్లోని ప్రముఖమైన డాక్టర్లు సిఫార్సు చేస్తారు.

ప్రెపరేషన్-హెచ్ ఔషధయుక్తమైన మలాము, అద్వితీయమైన ఫార్ములా— త్వరగా ఆ బాధ, దురదా నుంచి ఉపశమనం యిచ్చి, నిజానికిది వాపును తగ్గించి మొలలుగల కండరాలను ముడుచుకుపోయేలా చేస్తుంది. ప్రెపరేషన్-హెచ్, అక్కడ జారుడు చేసి, సుఖ విరోచనం అయ్యేలా చేస్తుంది.

15 గ్రా., 30 గ్రా. మరియు 50 గ్రా. ట్యూబుల్లో దొరుకుతుంది.




* Licensed user of TM: Geoffrey Manners & Co. Ltd.

GM-PH-84-TL

ఆ రోజు జానకి, రామ్మూర్తుల ఫస్ట్ వెడ్డింగ్ ఆనివర్సరీ.

జానకి ఆరు గంటలకే లేచి గడప ముందు ముగ్గు పెట్టింది. రామ్మూర్తి ఆ రోజు సెలవు తీసుకున్నాడు.

ఇద్దరూ కలిసి ముందు గుడికి వెళ్ళి, తరవాత సరదాగా బయట తిరిగి హొటల్లో భోంచేసి రావాలనుకున్నారు.

తొమ్మిది గంటలకు ఇద్దరూ కలసి బయటికి వచ్చేసరికి, బయట ముగ్గు లేదు. అది జానకికి పెద్ద అపశకునంగా అనిపించి ముఖం చిన్నబుచ్చుకుంది.

రామ్మూర్తి తేలిగ్గా కొట్టిపారేశాడు. తరవాత జానకి కూడా ఆ సంగతి మరిచిపోయింది.

మధ్యాహ్నం రెండుగంటలకు ఇంటికి వచ్చారు. భార్యను నేరుగా బెడ్‌రూంలోకి లాక్కెళ్ళాడు రామ్మూర్తి.

ఇద్దరూ మంచి మూడ్‌లో ఉండగా కాలింగ్ బెల్ మోగింది.

"ఎవరయ్యుంటారు?" అడిగాడు.

"ఇంకెవరు? ప్రక్కింటి పాటీ!" కసిగా అంది జానకి.

"పోనీలే తలుపు తీయకు. కొంచెం సేపు చూసి వెళ్ళిపోతుంది." భార్యను వదలకుండా అన్నాడు.

"ఏం పోదు. ముసల్ది అలా కొడుతూనే ఉంటుంది." చిరాగ్గా అంది.

అన్నట్టుగానే మళ్ళీ బెల్ మ్రోగింది. ఈసారి ఎక్కువ సేపు. ఇహ చేసేది లేక వెళ్ళి తలుపు తీసింది.

రివ్వున లోపలికి జొరబడింది పాటీ."ఏమమ్మా! ఇంత సేపు తలుపు తీయకపోతే నీ కేమయిందో నని బేజారయింది." సోఫాలో తిష్టవేసింది.

"తల నొప్పిగా ఉంది." తలుపు దగ్గర నిలబడి నీరసంగా చెప్పింది.

"అయ్యయ్యో! వేడిగా కాఫీ తాగమ్మా తగ్గుతుంది." సలహా ఇచ్చింది.

అర్థం చేసుకుని నిట్టూర్చింది జానకి. అంటే, కాఫీ ఇస్తేనే గాని పోదన్నమాట. ఈ అరవ వాళ్ళకు ఏం కాఫీ పిచ్చో!

పాటీ వెళ్ళాక భర్తతో చెప్పింది జానకి. "చూశారా. అండీ! ఇవాళ నేను పెట్టిన ముగ్గు తుడిపించి వర్ధన్నమ్మట- పాటీ చెప్పింది. ఇవాళ వర్ధనమ్మ మామగారి తద్దినమట. గడపముందు ముగ్గుంత కూడదని తుడిచేసిందట. పైగా అందట-పల్లె టూర్లో లాగ ఇంత పెద్ద ముగ్గు పెడితే ఎలా? ఏదో శాస్త్రానికి చిన్నది వేసుకోవాలి అని."

"పోనీలే. ఇలాటి చిన్న విషయాలకు నీవు ప్రక్కింటి వాళ్ళతో గొడవ పడొద్దు. రేపో చిన్న స్టికర్ కొనుక్కొచ్చి ఇంటి ముందు పెట్టెయ్ సరిపోతుంది." సలహా ఇచ్చాడు.

"మీ రిలాగే అన్నిటికీ పోనీలే అంటారు." భర్త మీద విసుక్కుంది.

"మరేం చేస్తాం? పోయి ఆవిడతో తగూ వేసుకుంటావా?" కసురుకున్నాడు.

నిట్టూర్చింది. "నిజమే! పరిస్థితుల్ని బట్టి అందరం మాడర్న్ అయిపోతున్నాం. ఇంటి ముందు ముగ్గేసుకోలేం. తులసికోట చుట్టూ ప్రదక్షిణం చేయలేం. తులసి కోటను బాల్కనీ గోడ మీద పెట్టాల్సి వచ్చింది."

రామ్మూర్తి జానకి మాటలు వినలేదు. నిద్రపోయాడు.

** ** **

సాయంత్రం రామ్మూర్తి టి. వి. కొనుక్కొచ్చాడు-జానకికి ఫస్ట్ వెడ్డింగ్ ఆనివర్సరీ సర్‌ప్రయిజ్ గిఫ్టుగా.

చిన్నపిల్లలా సంబర పడింది జానకి.

టి. వి. అతను ఆంటెన అదీ ఫిక్స్ చేసి వెళ్ళిపోయాడు.

హాల్లో కర్టన్లన్నీ దగ్గరకు లాగి.సోఫాలో రామ్మూర్తి ఒడిలో వాలి టి. వి. చూడసాగింది జానకి.

కాలింగ్ బెల్ మ్రోగింది.

తలుపు తీశాడు రామ్మూర్తి.

"నా పేరు సుందరరాజన్. 3 వ అంతస్థులో 14 వ నంబర్‌లో ఉంటున్నాను. మీరు టి. వి. ఆంటెన ఫిక్స్ చేయించడం చూశాను. ఎనిమిది గంటలకు ఎమ్. ఎస్. ప్రోగ్రాం ఉంది... విందామని వచ్చాను. మీకు అభ్యంతరం లేదు కదూ?" లోపలి కొచ్చాడు ఓ అయ్యర్.

మర్యాద చేశాడు రామ్మూర్తి. భార్య ముఖంలోని డిస్అపాయింట్‌మెంట్ చూసి చూడనట్టు ముఖం తిప్పుకున్నాడు.

పది గంటలకు ఇంగ్లీష్ న్యూస్ అయిన తరవాత వెళ్ళాడు రాజన్.తరవాత భార్యాభర్తల కూడా టి. వి. చూడాలని పించక ఆర్పేశారు.

** ** **

ప్రతిసాయంత్రం దాదాపు రామ్మూర్తి కంటే ముందే వచ్చేవాడు రాజన్. వీళ్ళ కిష్టంలేని ప్రోగ్రాంలు కూడా అతని కోసం చూడాల్సి వచ్చేది. ఓ ఇరవై రోజులకే టి. వి. ఎందుకొన్నామా అనిపించింది ఇద్దరికీ.

** ** **

ఓ రాత్రి రామ్మూర్తి, రాజన్‌లు టి. వి. చూస్తుండగా గ్రైండర్ పెట్టింది జానకి.

"జానకీ!" అరుస్తూ వచ్చాడు రామ్మూర్తి కిచెన్‌లోకి. "ఎన్నిసార్లు చెప్పాను ఈ గ్రైండింగ్ బిజినెస్ మధ్యాహ్నమే ఫినిష్ చేసుకోమని. టి. వి. లో డిస్టర్బెన్స్ వస్తోంది."

జాలిగా భర్తకేసి చూసింది జానకి. "మధ్యాహ్నం పెడుతూంటే సంగీత వచ్చిందండి. వాళ్ళమ్మ పంపిందట. వాళ్ళ నాన్న అప్పుడే టూర్ నుంచి వచ్చి పడుకోనున్నారట- గ్రైండర్ సాయంత్రం పెట్టుకోమని."

"అవును మరి. ఫ్రెండ్ కనుక అలా నీకు చెప్పి పంపగలిగింది. ఇంకోరి కయితే అలా కబురు పంపగలిగేదా?"

"అంతేకాదు; ఆయనకు వెజిటబుల్ పలావ్ ఇష్టమట. పొద్దున సంగీతను పంపింది- కొంచెం తెమ్మని."

"నీ వివాళ చేశావా? ఆవిడ కెలా తెలుసు?"

"పొద్దున చేస్తూంటే వాసన వచ్చిందట. బాల్కనీ లోంచి అడిగింది.ఏమిటని- చెప్పాను." ఏడుపు గొంతుతో అంది.

నిట్టూర్చాడు. "మన ఇంట్లో జరిగే సంగతులు నా కంటే పక్క ఇళ్ళ వాళ్ళకే ఎక్కువ తెలిసేటట్టున్నాయ్. ఈ వరసన లెట్రిన్‌లో ఎన్ని సార్లు లైట్ వెలిగిందీ చూచి ఎవరికి మోషన్స్ అని అడుగుతారేమో!"

"రాజన్ మామ వెళ్ళిపోయాడా?" అడిగింది.

"అప్పుడే ఎందుకు వెళతాడు? పదకొండుకు నేషనల్ నెట్ వర్క్‌లో ఎమ్.ఎస్. వయొలిన్ ఉంది. అది అయ్యేంతవరకూ కదలడు." మొదటిసారిగ విసుక్కున్నాడు రామ్మూర్తి.

xx xx xx

రోజులు భారంగా గడుస్తున్నాయ్. పొద్దున పాటీ. సాయంకాలం రాజన్ మామ. మధ్య మధ్యలో వాసనలను బట్టి సాదకాలూ. పప్పుళ్ళను బట్టి రుబ్బిన పిండి పట్టుకు పోయే సరోజ. అమిత విసుగ్గా ఉంది జానకికి.

ఈ మధ్య పాటీకూడా మొదలు పెట్టింది వస్తువులు పట్టుకెళ్ళడం. 'ఒక్క తక్కాళీ ఈయమ్మా. అది వేస్తేగాని. రసం ఘుమఘుమ లాడదు' అంటూ మెట్లమీదే ఎదురొచ్చి సంచిలోంచి పట్టుకెళ్తోంది. అందరూ జానకి మెత్తదనం చూసి అతి చనువు తీసుకుంటున్నారు. విసుగ్గా ఉంది దంపతు లిద్దరికీ. బొత్తిగా ప్రైవసీ కరువయింది. ఇంటి కంటె గుడి వదిలమన్నట్టు స్నేహితుల ఇళ్ళల్లో పడి ఉండటమే హాయిగ ఉంది ఇద్దరికీ.

సంగతంతా స్నేహితుడు మాధవ రెడ్డితో మొర పెట్టుకున్నాడు రామ్మూర్తి.

విని ఒక ప్రశ్న అడిగాడు మాధవరెడ్డి -"వాళ్ళందరూ వెజిటేరియన్సా?" అని.

ఔనన్నాడు రామ్మూర్తి.


ఉపాయం చెప్పాడు.

xx xx xx

ఓ ఆదివారం నాడు మాధవరెడ్డి. అతని భార్యా రామ్మూర్తి ఇంటికి వచ్చారు. వస్తూ.ఇంట్లో చేసిన చేపల పులుసు పట్టుకొచ్చారు.

అది రామ్మూర్తి ఇంట్లో మళ్ళీ ఉడక బెట్టారు.

ఆ వాసనకు సరోజ బాల్కనీలోకి వచ్చి అడిగింది- ఏమిటని. జవాబు విని. ముఖం చిట్లిస్తూ గిరుక్కున వెనుదిరిగిపోయింది.



అంతే! తరవాత పాదకాలు తీసుకెళ్ళడం బంద్!

ఆ వార్త పాటీ చెవిదాకా వచ్చింది. ఎప్పుడయినా పచ్చి కూరగాయలు తీసుకెళ్ళడం తప్ప. పాటీ వీళ్ళింట్లో కాఫీ తాగటం, వంట ఇంట్లోకి వెళ్ళడం మానేసింది. రాకపోకలుకూడా బాగా తగ్గించింది. సహం బాధ తగ్గినందుకు సంతోషించారు భార్యాభర్తలు. ఇహ మిగిలింది రాజన్ మాదు.

దానిక్కూడా పాచిక ఆలోచించారు.

ఇంకో ఆదివారంనాడు రాజన్ మాదు, అతని భార్య మీనాంబాళ్ రామ్మూర్తి ఇంటికి వచ్చారు- టీ.వి. సినిమాచూట్టానికి. పైగా అది శివాజీగణేశన్ పిక్చర్.

ఆ రోజు జానకి అమిత స్టైల్‌గ తయారయింది. దూమెరుగ్గా లిప్‌స్టిక్ రాసుకుంది. సన్నటి నైలాన్ నైట్ గౌన్ వేసుకుంది. గౌన్ లోపలి లేస్‌బాడీ. లోతులు కనిపించేటట్లు కూర్చుంది. మీనాంబాళ్ మొహం జానకిని చూటంతోటే అప్రసన్నంగా మారింది. సినిమా బొత్తిగా ఎంజాయ్ చేయలేకపోయింది. అసలు చూసిందో, లేదో! చూపంతా జానకి మీదే!

మధ్యలోనే చిర్రు బుర్రు లాడుతూ వెళ్ళిపోయింది.

ఈ ప్లాన్ కూడా ఫలించింది. వారం తిరక్కుండానే మీనాంబాళ్ టీ.వి. కొనింది.

రామ్మూర్తి, మాధవరెడ్డి లిద్దరూ ఛీర్స్ చెప్పుకుంటూ పార్టీ చేసుకున్నారు.

ఇంకో రెండు నెలలు గడిచిపోయాయి. అందరూ అతిగ లేకుండా ఓ మోస్తరు స్నేహంతో ఉన్నారు. జానకి ప్రాణానికి హాయిగ ఉంది.

పాటీ మాత్రం అప్పుడప్పుడు నైట్ గౌనులు వేసుకోవద్దని, నాన్ వెజిటేరియన్ తినొద్దని నీతులు చెప్పబోతే, జానకి ఠపీమని టాపిక్ మార్చేసేది.

xx xx xx

జానకి కడుపుతో ఉంది. రామ్మూర్తి చాలా సంతోషంగా ఉన్నాడు. మూడో నెల జరుగుతూ ఉండగ ఓ రోజు విపరీతంగ కడుపు నొప్పి వచ్చింది.

రామ్మూర్తి ఆఫీసునించి వచ్చే లోపలే వర్ధనమ్మ, పాటీలు కలిసి జానకిని హాస్పటల్‌కు తీసుకెళ్ళారు.

సరోజ, వర్ధనమ్మ, పాటీ, వసంత మామిలు వంతుల వారిగా జానకికి హాస్పటల్‌కు అన్నం తెచ్చి తోడు కూర్చునేవారు.

రామ్మూర్తికూడా పొద్దున బ్రేక్‌ఫాస్ట ఒక ఇంటి నుంచి, రాత్రి డిన్నర్ ఇంకో ఇంటినుంచి.

దంపతు లిద్దరినీ ఈ ఆదరాభిమానాలు ఉక్కిరిబిక్కిరి చేశాయి.

ఓ రోజు హాస్పటల్‌లో భర్త చేతిలోని తాళాలు చూస్తూ అడిగింది జానకి."ఏం తాళా లివి?"

"నీవు హాస్పటల్‌లో ఉన్నన్ని రోజులూ వాడుకోమని మిస్టర్ రాజన్ బలవంతాన ఆయన స్కూటర్ ఇచ్చాడు."

భార్యా భర్త లిద్దరూ ఒకర్నొకరు చూసుకున్నారు. ఇద్దరి మనసుల్లోనూ వొకటే ఆలోచన. ఒకటే గిల్టీ కాన్షన్స్!

కళ్ళలో నీళ్ళు తిరుగుతూ ఉండగ అంది జానకి: "నాకు వస్తున్న విజిటర్స్‌ను చూసి నర్స్ అంది- 'ఎంత అదృష్టవంతురాలవు. ఇంత మంచి నైబర్స్ ఉన్నారు' అని. పాపం పక్క రూమ్‌లో ఉన్నావిడకు అబార్షన్ అయిందట. ఆవిడ భర్త క్లబ్బు పక్షి అట. ఆయన లేనప్పుడు ఆవిడకు అబార్షన్ సూచనలు కనబడితే పక్కింటి వాళ్ళ నడిగిందట తోడు రమ్మని. అందరూ వీలు కాదని పాలిష్డ్‌గ సాకులు చెప్పారట. డాక్టర్ అందిట- కొన్ని గంటల ముందు వచ్చి ఉంటే కాపాడ గలిగి ఉండేదాన్ని అని. అప్పుడు నా కనిపించింది- ఎంత గండం గడిచింది మనకు అని."

"ఔను.నాకూ ఇప్పుడనిపిస్తోంది- మనం సెల్ఫీగ, చైల్డిష్‌గ బెహేవ్ చేశామేమోనని. పోనీ అయిందేదో అయిపోయింది. మీ ఊరెళ్తావా కొన్నాళ్ళు విశ్రాంతి కోసం?" అడిగాడు.

"వద్దని వీళ్ళందరూ చెప్తున్నారు. మే మంతా లేమా అంటున్నారు. పైగా ఈ పరిస్థితుల్లో ప్రయాణంకూడా మంచిది కాదట. పాటీ అయితే 'ఇంకో పది రోజులు నేను గానస్టవ్ వెలిగిస్తే ఊరుకోను అంది." నవ్వుతూ చెప్పింది.

రామ్మూర్తికూడా నవ్వాడు.

హాస్పటల్‌నుంచి డిశ్చార్జి అయి, తన బిల్డింగ్ లోకి వస్తూ ఎక్కడో చదివిన వాక్యం గుర్తు తెచ్చుకుంది జానకి.'ఎ హౌస ఈజ్ బిల్ట్ బై హాండ్స్; ఎ హోమ్ ఈజ్ బిల్ట్ బై హార్ట్.' ★



Chhaya/PP/415